క్లుప్తంగా

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ నాగమణి



మురళీకృష్ణా నగర్‌లో బురద తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మీర్‌పేట: బస్తీలు, కాలనీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగమణి పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం 'సాక్షి'దినపత్రికలో 'వీధుల్లో మురుగు.. పారిశుద్ధ్యం కనుమరుగు'శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు మీర్‌పేట కార్పొరేషన్ యంత్రాంగం స్పందించింది. కమిషనర్ నాగమణి ఆదేశాల మేరకు శానిటేషన్ అధికారులు, సిబ్బంది లెనిన్‌నగర్ మురళీకృష్ణానగర్, చంద్రానగర్ బస్తీలలో వీధులు, ఇళ్ల మధ్య నిలిచిన బురదను తొలగించారు. అనంతరం బ్లీచింగ్‌ను చల్లారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 16వ డివిజన్‌కు చెందిన నారాయణగౌడ్ గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్ సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును శనివారం క్యాంపు కార్యాలయంలో నారాయణగౌడ్‌కు ఎమ్మెల్యే సబితారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్‌గౌడ్, జటావత్ శ్రీనునాయక్ ఉన్నారు.

వాలీబాల్ జట్టుకు అభినందనలు



జెడ్పీహెచ్‌ఎస్ వాలీబాల్ జట్టును అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కందుకూరు: స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్–14 విభాగంలో ఇటీవల జిల్లా పరిషత్ పులిమామిడి పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో నేదునూరు జెడ్పీహెచ్‌ఎస్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు శనివారం ఆ జట్టు సభ్యులను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ అభినందించారు. కార్యక్రమంలో పీడీ అబ్దుల్లా, ఉపాధ్యాయులు విజయమోహన్‌రెడ్డి, గ్లోరీ, కౌసల్య, శ్రీవాణి, కరుణాకర్, కృష్ణ, ఎండీ బషీర్, గిరిజ, హసునోద్దీన్, సర్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు హేయనీయం

సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్



బాల్‌రాజ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

కందుకూరు: ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్స్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి చేపట్టారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టులు చేశారు. సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్‌ను శనివారం ఉదయం పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. అక్రమంగా అరెస్టులను చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వం కార్మికుల గొంతు మీద కత్తి పెట్టడమేనని ఆరోపించారు. ప్రజల తగిన సమయంలో ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు.

రైతు కమిషన్ చైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ చైర్మన్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

కందుకూరు: రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, కమిషన్ సభ్యురాలు మరికంటి భవానిరెడ్డిని శనివారం కందుకూరు పీఏసీఎస్ చైర్మన్ సత్తినేని వెంకట్రామ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మాజీ ఎంపీపీ పి.మహేష్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.ప్రశాంత్ కుమార్, మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త ప్రీమియం.. కొండత భరోసా



మంఖాల్ తపాలా కార్యాలయం

- కొత్త పథకానికి శ్రీకారం చుట్టిన తపాలా శాఖ
- ప్రమాదకర పరిస్థితుల్లో అండగా..

తుక్కుగూడ: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమాదాలు చెప్పి జరగవు. ఉరుకుల పరుగుల జీవితంలో ఏదైనా జరిగితే ఆస్పత్రి పాలై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు కుటుంబం మొత్తం వీధిన పడే అవకాశం ఉంది. కొన్నిసార్లు పూర్తిగా లేదా పాక్షిక వైకల్యం కలుగొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యక్తిగత బీమా అండగా ఉంటుంది. దీనికి తపాలా శాఖ (పోస్టు ఆఫీస్) కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. సామాహిక ప్రమాద బీమాను తీసుకొచ్చింది. దీంతో పాటు ప్రైవేటు బీమా సంస్థలు నిర్ణయించిన వార్షిక ప్రీమియం చెల్లిస్తే రూ.5లక్షలు, రూ.10 లక్షలు, రూ.15 లక్షలు వరకు బీమా వర్తిస్తుంది. అయితే పాలసీ ప్రీమియం ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)లోనే చెల్లించాలి.

బీమా వర్తింపు ఇలా..

- 18 నుంచి 65 ఏళ్ల వారు అర్హులు.
- ప్రమాదంలో మరణించిన, శాశ్వత వైకల్యం ఏర్పడినా, అవయవం కోల్పోయినా, పక్షవాతం వచ్చినా రూ.10 లక్షల బీమా పరిహారం ఇస్తారు.
- బీమా తీసుకున్న వ్యక్తి ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరితే ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఐపీడీ) కింద రూ.లక్ష క్లైయిం చేస్తారు.
- ఆస్పత్రి ఖర్చు నిమిత్తం రోజుకు రూ.వెయ్యి చొప్పున పదిరోజుల పాటు చెల్లిస్తారు.
- విద్యా ప్రయోజనాలకు గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు కళాశాల ఫీజులో 10 శాతం లేదా రూ.లక్ష వరకు ఎంచుకోవచ్చు.

సంస్థలు చెల్లించే ప్రమాద బీమా, ప్రీమియం వివరాలు

సంస్థ పేరు	రూ.10 లక్షలు	రూ.15 లక్షలు
టాటా ఏఐజీ	రూ.699	-
ఆదిత్యబిర్లాక్యాపిటల్	రూ.549	రూ.749
రిలియన్స్ జీఐ	రూ.550	-
బజాజ్	రూ.557	-
స్టార్ హెల్త్	రూ.559	రూ.799

సామాన్యులకు అందుబాటులో..



ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా ప్రమాద బీమా పాలసీలు అతి తక్కువ ప్రీమియంతో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ పథకాలపై ప్రజలకు ఆవగాహన కలిపిస్తూ బీమాలను చేయిస్తున్నాం. ఇప్పటివరకు చాలా మంది పాలసీలు తీసుకున్నారు.

– నవీన్‌కుమార్, ఏస్‌పీఎం, మంఖాల్ తపాలా కార్యాలయం



లెనిన్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

- ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: లెనిన్‌నగర్‌లో మురుగు, వరదనీటి ముప్పు సమస్యకు శాశ్వత పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె మీర్‌పేట కార్పొరేషన్ 35 వ డివిజన్‌లోని మురళీకృష్ణానగర్, చంద్రానగర్‌లలో అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. భారీ వర్షాలు పడినప్పుడు బడంగ్‌పేట, బాలాపూర్ పై ప్రాంతాల నుంచి వరదనీరు డ్రైనేజీల్లోకి రావడంతో పొంగిపొర్లి నీరంతా ఇళ్లలోకి చేరి అవస్థలు పడుతున్నామని బస్తీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాల అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ నాగమణి, డీఈ వేణుగోపాల్, స్థానిక నాయకులు జటావత్ శ్రీనునాయక్, విజయ్, సునీత బాలరాజ్, పల్లె జంగయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

హామీల అమలుకు డిమాండ్

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బొర్ర రవి డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికుల పింఛన్లు పెంచుతామని చెప్పి 22 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్, నరసింహ, మహేశ్, రామకష్ణ, లింగస్వామి తదితరులున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవించుకున్న కాలనీవాసులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీవేంకటేశ్వర కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం వారు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు, వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మున్సిపలిటీకు అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నామని, అందుకు అనుగుణంగా తమకు సదుపాయాలు కల్పించేలా చూడాలని విన్నవించుకున్నారు. ఆమెను కలిసిన వారిలో అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వి.రవీందర్, ప్రధాన కార్యదర్శి వి.కులశేఖర్, సంయుక్త కార్యదర్శి బి.రాజశేఖర్, కోశాధికారి వి.కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి

- ప్రత్యేకాధికారి జి.వెంకటనారాయణ



సమీక్షలో పాల్గొన్న అధికారులు

పహాడీషరీఫ్: నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మున్సిపాలిటీ సిబ్బంది నడుచుకోవాలని జల్‌పల్లి ప్రత్యేకాధికారి జి.వెంకటనారాయణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన కమిషనర్ వి.వెంకట్రామ్ అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.మున్సిపాలిటీ ఆదాయానికి మూల కారణంగా ఉన్న బిల్లు కలెక్టర్లు ఎప్పటికప్పుడూ పన్నులు వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు శుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, అనధికార నిర్మాణాలకు నోటీసులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సూచించారు.సిబ్బంది జీత భత్యాల విషయంలో అకౌంట్స్ విభాగం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ కార్పొరేటర్ అనిత, నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరైనా మూడేళ్లుగా పనులు చేపట్టకుండా కావాలనే వివక్ష చూపుతున్నారని 21వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బంగారు అనిత అన్నారు. శనివారం డివిజన్ పరిధిలో పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేస్తూ కమిషనర్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 21వ డివిజన్‌లోని భీష్మనగర్ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరై.. రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంకా పనులు మొదలు పెట్టలేదన్నారు. చిల్డ్రన్స్‌పార్కు, గండారెడ్డి కాలనీలో ఓపెన్ జిమ్‌లకు నిధుల మంజూరైనా పనులు మాత్రం కొనసాగడం లేదని తెలిపారు. క్రమం తప్పకుండా డివిజన్ ప్రజల చేత పన్నులు కట్టిస్తున్నా పనులు ఎందుకు చేయడం లేదని ప్రశించారు. కావాలనే డివిజన్‌పై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పనులు మొదలు పెట్టకపోతే డివిజన్ ప్రజలతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార జేఏసీ కన్వీనర్ విశారధన్ మహారాజ్
- మహేశ్వరంలో జేఏసీ ఆవిర్భావ సమావేశం



అభివాదం తెలుపుతున్న విశారధన్ మహారాజ్

మహేశ్వరం: అణగారిన వర్గాలకు రాజ్యాధికారం దక్కించుకునే పోరాటంలో ప్రతిఒక్కరూ కలిసి రావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార జేఏసీ కన్వీనర్ విశారధన్ మహారాజ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో శనివారం జేఏసీ ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని భూములు నిజాం రాజు నుంచి అగ్ర వర్ణాల చేతిలోకి వెళ్లాయన్నారు. పేదల భూములను కొల్లగొడుతున్న అగ్రవర్ణాలు భూ వ్యాపారం చేస్తూ ప్రపంచంలోనే అత్యంత ధనవంతులుగా అవతరామెత్తారన్నారు. రంగారెడ్డి జిల్లాకు కేవీ రంగారెడ్డి ఏం చేశారని ఆయన పేరు పెట్టారని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పండగ సాయన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. 10శాతం లేని అగ్రవర్ణాలు 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలను పాలించడం అప్రజాస్వామికమన్నారు. రాజ్యాధికారం సాధించినప్పుడే దళిత బహుజనులకు అసలైన స్వాతంత్ర్యం దక్కుతుందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీలను సొంత ఎజెండా కోసమే ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని బీసీ కులాలకు చెందిన వారిని అసెంబ్లీకి, పార్లమెంట్‌కు పంపాలన్నారు. 2029లో బహుజన రాజ్యం వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ చిరంజీవులు, జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్లు వినోద్ యాదవ్, రాఘవేందర్ ముదిరాజ్, దాసోజ్ లలిత, జిల్లా ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తులసిగారి రవీందర్, మంచాల భిక్షపతి, రాకేష్, అమరేందర్, లాలయ్య, రాజు, నర్సింహ, జంగయ్య, శేఖర్, వినోద్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కందుకూరు: కందుకూరు పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం యూరియా అందుబాటులో ఉంటుందని ఏఓ లావణ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1750 నుంచి 2200 వరకు టోకెన్లు పొందిన రైతులు సకాలంలో వచ్చి యూరియా తీసుకోవాలన్నారు. 450 బస్తాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, మరో 450 బస్తాలు రానున్నాయని తెలిపారు.

కీర్తనకు ఓయూ మెడికల్ కాలేజీలో సీటు



బడంగ్‌పేట్: బడంగ్‌పేటకు చెందిన గుడ్ల శ్రీనివాస్, రాధ కుమార్తె గుడ్ల కీర్తనకు ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో సీటు దక్కింది. రెండు రోజుల క్రితం జరిగిన అడ్మిషన్‌లలో కీర్తనకు ఉస్మానియా కాలేజీలో సీటు రావడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని స్థానికులు అభినందనలు తెలిపారు.

ఘనంగా అమ్మవారి ఆగమన్



ఆగమన్ శోభాయాత్రలో పాల్గొన్న యంగ్ ఇండియన్స్ యూత్, భక్తులు

పహాడీషరీఫ్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో యంగ్ ఇండియన్స్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అమ్మవారి 'ఆగమన్' కార్యక్రమం కనుల పండువగా కొనసాగింది. పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాల మధ్య బాణాసంచా పేల్చుతూ అమ్మవారిని స్వాగతించారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని కనులార వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లోని శ్రీహిల్స్ కాలనీలో అధికారులు శనివారం డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ముఖ్యులుగా హాజరయ్యారు. నిర్మాణానికి సహకారం అందించిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన గారి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ సరస్వతి రాఘవేందర్‌రెడ్డితో పాటు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు ఏదుల్ల ప్రతాప్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

కొత్తూరు: ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో సేవ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పలు అంశాలపై చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నర్సింహాగౌడ్, మల్లేశ్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, శివనాయక్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువతతో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ బీజేపీ కార్యాలయంలో శనివారం ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్, ఎన్నికల జిల్లా కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెలశ్రీరాములు హాజరయ్యారు. యువకులు, పార్టీ నాయకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునిత, గూడెపు ఇంద్రసేన, లక్ష్మారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



బడంగ్‌పేట్: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ ఆహ్వానం మేరకు కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాత వేడుకల్లో పాల్గొన్నారు. దసరా, బతుకమ్మ పండుగల విశిష్ఠతను వివరించారు.

శ్రీరాంకాలనీలో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీలోని యువన్ పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను వైభవంగా నిర్వహించారు.విద్యార్థినులు సాంప్రదాయ వస్త్రాధారణలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు అనుగుణంగా బతుకమ్మలను పేర్చితీరొక్క ఆటాపాటలతో అలరించారు.

జిల్లెలగూడలో..

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలోని లార్డ్స్ స్కూల్‌లో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను పాఠశాల ఆవరణలో ఉంచి ఆడిపాడారు.



పహాడీషరీఫ్: బతుకమ్మ సంబురాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



మీర్‌పేట: బతుకమ్మ వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

రుణాల చెల్లింపునకు కృషి

- మండల మహిళా సమాఖ్య ఏపీఎం నర్సింలు

మొయినాబాద్‌రూరల్:మండలంలో ఆయా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సమయానికి బ్యాంకుల్లో చెల్లించేందుకు వీవోఏలు కృషి చేయాలని మండల మహిళా సమాఖ్య ఏపీఎం నర్సింలు అన్నారు. శనివారం మండల మహిళా సమాఖ్య భవనంలో మండలంలోని 51 మంది వీవోఏలతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరంలో మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించేందుకు కృషి చేయాలన్నారు. దీంతో సంఘాలకు తిరిగి వెంటనే రుణాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకుగాను ఆయా గ్రామాల్లోని వీవోఏలు సమావేశాలను ఏర్పాటు చేసుకొని వారు తీసుకున్న రుణాలను పరిశీలించి చెల్లించే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.